నాలుగు నెలలుగా జీతాలు బంద్..!



ఉద్యోగులతో మాట్లాడుతున్న కమిషనర్ సతీశ్

- ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు
- కుటుంబ పోషణకు నానా అవస్థలు
- సుమారు రూ.1.53లక్షల ఈపీఎఫ్ డబ్బులు అకౌంట్లలో జమచేయని వైనం
- జీతాలు చెల్లించాలని ఉద్యోగుల నిరసన

చెన్నూర్: చేసిన పనికి ప్రతి నెలా రావాల్సిన జీతాలు రాక, బయట అప్పులు పుట్టక మున్సిపాలిటీలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్, తాత్కాలిక ఉద్యోగులు, సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిసారి ఈ నెల అయినా తమకు జీతాలు వస్తాయని ఎదురు చూడడం, తీరా జీతాలు రాకపోవడంతో చేసేది ఏమీ లేక నిరుత్సాహపడడం తాత్కాలిక, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి పరిపాటిగా మారింది.

మొత్తం 216 మంది సిబ్బంది విధులు...

మున్సిపాలిటీ పరిధిలో శాశ్వత ఉద్యోగులు కాకుండా తాత్కాలిక ఉద్యోగులుగా 86మంది, ఔట్‌సోర్సింగ్ పరిధిలో 130మంది, మొత్తం 216మంది వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి ప్రతీ నెల మున్సిపల్ సాధారణ నిధుల నుంచి జీతాలు చెల్లించాల్సి ఉంది. సాధారణ నిధుల నుంచి జీతాలు చెల్లించడం సాధ్యం కావడం లేదని అధికారులు సిబ్బంది జీతాలు చెల్లింపులో ఆలస్యం చేస్తున్నారు.

ఈపీఎఫ్ డబ్బులు జమ చేయడంలో అలసత్వం..

మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, తాత్కాలిక ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయాల్సిన సుమారు రూ.1.53 లక్షలను మున్సిపల్ అధికారులు ఇప్పటి వరకు ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ప్రమాదవశాత్తు ఎవరైనా కార్మికుడికి ఏదైనా జరిగితే వారి పరిస్థితి ఏమిటని పలువురు కార్మికులు ప్రశ్నిస్తున్నారు.

జీతాలు చెల్లించాలని ఉద్యోగుల నిరసన...

తమకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, తాత్కాలిక ఉద్యోగులను అకారణంగా విధుల్లో నుంచి తొలగిస్తున్నారని మున్సిపాలిటీలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్, తాత్కాలిక ఉద్యోగులు మంగళవారం తమ విధులకు హాజరుకాకుండా నిరసన తెలియజేశారు. విషయం తెలుసుకున్న కమిషనర్ సతీష్ నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులతో మాట్లాడి, జీతాల చెల్లింపునకు చర్యలు తీసుకుంటామని తాత్కాలిక ఉద్యోగుల సమస్యలు త్వరగా పరిష్కరిస్తామని తెలుపడంతో ఉద్యోగులు తమ నిరసనను విరమించి విధుల్లోకి వెళ్లారు.

నాలుగు నెలలుగా జీతాలు చెల్లించలే...

మున్సిపాలిటీలో విధులు నిర్వర్తిస్తున్న తాత్కాలిక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మార్చి నెలలో జీతాలు చెల్లించగా ఏప్రిల్, మే, జూన్, జూలై నెలలకు సంబంధించిన సుమారు రూ.87లక్షల మేర జీతభత్యాలు నేటి వరకూ చెల్లించలేదు. దీంతో ఉద్యోగులు తమ కుటుంబాలను పోషించుకోవడం కోసం అప్పుల పాలవుతున్నామని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు.

అకౌంటెంట్ లేని వైనం...

మున్సిపాలిటీలో అత్యంత కీలకమైన అకౌంటెంట్ పోస్టు కొన్ని నెలలుగా ఖాళీగా ఉంది. గతంలో ఇక్కడ అకౌంటెంట్‌గా విధులు నిర్వర్తించిన నాగవేణి ఫిబ్రవరిలో బదిలీపై వెళ్లగా, అకౌంటెంట్ సెక్షన్‌కి సంబంధించిన లెక్కలు అన్నీ ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగితో చేపిస్తున్నారు.. అంటే మున్సిపాలిటీలో పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

సార్ మేము సంతకాలు పెట్టం

- వివాదాస్పద భూమిలో సాగుకు యత్నం
- అదుపులోకి తీసుకున్న అధికారులు

వేమనపల్లి: హైకోర్టు వివాదంలో ఉన్న గోదుంపేట భూమి వివాదం ముదురుతోంది. వివాదాస్పద భూమిలోకి ఎవరు వెళ్లకూడదని అధికారులు తెలుపుతున్నా రాజారాం, వేమనపల్లి గ్రామాలకు చెందిన వ్యక్తులు సాగుకు యత్నిస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా అధికారుల కంట పడకుండా విత్తనాలు నాటుతున్నారు. మంగళవారం అటవీ రేంజ్ అధికారి గోవింద్‌చంద్ సర్దార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి కొందరిని అదుపులోకి తీసుకున్నారు. తహసీల్దార్ కె.రమేష్ వద్దకు తీసుకొచ్చి బైండోవర్ చేసేందుకు యత్నించగా రైతులు ఒప్పుకోలేదు. మీరు చెబుతున్నట్లు వింటాం, వివాదాస్పద భూమిలోకి వెళ్లం, కానీ బైండోవర్ చేస్తానంటే ఒప్పుకోం.. ఒప్పంద కాగితాల మీద సంతకాలు పెట్టం.. అంటూ తహసీల్దార్‌కు, రేంజర్‌కు తెలిపారు. గోదుంపేట శివారులో ఉమ్మడి రాష్ట్ర హయాంలో వేమనపల్లి, రాజారాం గ్రామాలకు చెందిన సుమారు 75మందికి అప్పటి ప్రభుత్వాలు పట్టాలు ఇచ్చాయి. తాము 20సంవత్సరాల క్రితం కొంత మంది ఆ భూమిని సాగు చేసుకున్నారు. అటవీ శాఖ అభ్యంతరంతో గత 15 సంవత్సరాలుగా ఎవరూ సాగు చేసుకోవడం లేదు. అప్పటి నుంచి అటవీ, రెవెన్యూ శాఖల మధ్య వివాదాస్పద భూమిగానే ఉంది. గత 5సంవత్సరాల క్రితం ఈ భూమిపై తమకు పట్టాలున్నాయని హైకోర్టులో వేమనపల్లికి చెందిన వారు వాజ్యం వేశారు. హైకోర్టు పరిధిలో ఉన్నందునా, ఆ భూమిని ఎవరూ సాగు చేయవద్దని రెవెన్యూ, అటవీ శాఖలు సూచిస్తూనే ఉన్నాయి. కానీ ఇటీవల పెద్దమొత్తంలో రైతులు సాగు చేసుకునేందుకు యత్నిస్తుండగా రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖలకు ఇబ్బందిగా మారింది. జిల్లా కలెక్టర్, అటవీశాఖ ఉన్నతాధికారులు జాయింట్ సర్వే చేసి భూవివాదాన్ని పరిష్కరించాలని కోరుతున్నారు.



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్, రేంజర్

సంక్షిప్త వార్తలు

శ్మశాన వాటిక స్థలం కాపాడాలి

మందమర్రిరూరల్: పట్టణంలోని యాపల్ సమీపంలోని జాతీయ రహదారి పక్కన గల శ్మశాన వాటిక స్థలం ఊరుమందమర్రికి చెందిన కొందరు చదును చేసి కబ్జా చేయడానికి పూనుకున్నారని, ఆ స్థలాన్ని కాపాడాలని పట్టణంలోని యాపల్, పరిసర ప్రాంత ప్రజలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ ఆఫీస్ వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించి, అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందించారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

దండేపల్లి: మండలంలోని లింగాపూర్‌కు చెందిన బానవత్ నాగన్న తన ఫోన్‌ను ఇటీవల ఎక్కడో పోగొట్టుకున్నాడు. దీంతో అతడు దండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్‌ను పోలీసులు గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఎస్సై ఉదయ్‌కిరణ్ నాగన్నకు ఫోన్ అప్పగించారు.

శిక్షణ తరగతుల కరపత్రాలు ఆవిష్కరణ

చెన్నూర్: హన్మకొండలో ఈ నెల 15, 16, 17తేదీలలో జరిగే కేవీపీఎస్ రాష్ట్ర సామాజిక శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరుతూ కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దూర్కె మోహన్ ఆధ్వర్యంలో స్థానిక కొత్త బస్టాండ్ ప్రాంతంలో కరపత్రాలను ఆవిష్కరించారు.

పింఛన్ పునరుద్ధరించాలి

బెల్లంపల్లి: దివ్యాంగురాలైన ఒంటరి మహిళకు పింఛన్ పునరుద్ధరించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా సహాయ కార్యదర్శి పి.వెంకటేష్ డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మాట్లాడారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలోని 16వార్డు పోస్టాఫీసు బస్తీకి చెందిన మెట్టు కాంత లక్ష్మి అప్పట్లో పింఛన్ మంజూరు కాగా 2019సంవత్సరంలో నిలిపివేశారని తెలిపారు. తల్లిదండ్రులు లేని, 60శాతం వైకల్యం కలిగిన కాంత లక్ష్మికి చెవులు వినబడవు, మాటలు రాని మహిళ అన్నారు. ఆమె పింఛన్‌కు అర్హురాలైనప్పటికీ అధికారులు కనికరించడం లేదన్నారు. కలెక్టర్ స్పందించి బాధితురాలికి ఆగిపోయిన పింఛన్‌ను పున:రుద్ధరించాలని కోరారు.

'రక్షణ మరువద్దు'

శ్రీరాంపూర్: ఎల్లవేళలా రక్షణను మరువద్దని ఏరియా సేఫ్టీ అధికారి శ్రీధర్‌రావు తెలిపారు. ఆర్కే 7గనిపై మంగళవారం రక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గనుల్లో జరిగే ప్రమాదాల నివారణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఆయన దిశానిర్దేశం చేశారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని సండ్రోన్‌పల్లె వద్ద గల రైతు వేదికలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణ వాతావరణ పరిస్థితులు, అనువైన వంగడాల పై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, జగిత్యాల శాస్త్రవేత్త గోన్యా నాయక్ రైతులకు అవగాహన కల్పించారు.

ఆశకార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

దండేపల్లి: ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించి, వారికి కనీస వేతనం నెలకు రూ.26వేలు చెల్లించాలని, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ డిమాండ్ చేశారు. దండేపల్లి పీహెచ్‌సీ వద్ద ఆశ కార్యకర్తలతో మంగళవారం సమావేశమయ్యారు. ఆశల డిమాండ్స్ డే వినతిపత్రాన్ని మెడికల్ ఆఫీసర్ సతీష్‌కు అందించారు. అనంతరం ఆశకార్యకర్తలు సీఐటీలో చేరారు. ఆశల సీఐటీయూ అనుబంధ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా పద్మ, లలిత, కార్యదర్శులుగా గంగామణి, కోశాధికారిగా రాధ లను ఎన్నుకున్నారు.

న్యాయం చేయాలి

చెన్నూర్: పట్టణంలోని కత్తెరశాల రోడ్డులో గల 869, 862సర్వే నంబర్‌లో 3.16ఎకరాల నా సొంత భూములను కొందరు వ్యక్తులు ఖాళీ చేయాలని బెదిరింపులకు పాల్పడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని దివ్యాంగులు రమ్య, సడవలిలు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అధికారులు న్యాయం చేయాలని కోరారు.

'పేదల భూములు కాజేసేందుకు కుట్ర'

చెన్నూర్: సోమన్‌పల్లిలో ప్రభుత్వం ఇచ్చిన పేదల భూములు కాజేందుకు కొందరు ఉన్నత వర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే పేరు చెప్పి కుట్రలు పన్నుతున్నారని సోమన్‌పల్లి గ్రామానికి చెందిన తోకల మధునయ్య, రాజులు ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వరి పంట సాగు కోసం మా భూమిలో నారు మడి వేస్తే, ధ్వంసం చేశారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఓ రెస్టారెంట్‌లో కొందరు ప్రముఖులు పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు ఆదేశాలతో మంగళవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 9మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వీరి వద్ద నుంచి రూ.1లక్ష 78వేలు నగదు స్వాధీనం చేసుకుని, తదుపరి విచారణ కోసం స్థానిక పోలీస్‌స్టేషన్లో అప్పగించినట్లు సమాచారం.

అభివృద్ధి పనుల కోసం ఎంపీ, ఎమ్మెల్యేకు వినతి



పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణకు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

భీమారం: మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చే యాలని మండలంలోని కాంగ్రెస్ నాయకులు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి మంగళవా రం వినతిపత్రాలు అందజేశారు. భీమారం మండల కేంద్రం నుంచి ఆర్కెపల్లి వరకు రో డ్డు నిర్మించాలని కోరారు. భీమారం గ్రామానికి చెందిన రైతుల భూములు మొత్తం ఆర్కెపల్లి గ్రామ పరిధిలో ఉన్నాయని, అక్కడి వెళ్లేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామాల్లో రోడ్లు, మురుగు కా లువలు నిర్మించాలని విన్నవించారు. వినతిపత్రాలు ఇచ్చినవారిలో జిల్లా నాయకుడు పొడే టి రవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోహ న్‌రెడ్డి, నాయకులు దర్శనాల రమేశ్, బూక్య లక్ష్మణ్, బూక్య రాజ్‌కుమార్ ఉన్నారు.

అసెంబ్లీ స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే



స్పీకర్‌తో ఎమ్మెల్యే వినోద్, కుమార్తె వర్ష

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ శాసన సభ స్పీకర్ , వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌ను మంగళవాం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే వినోద్ తన కుటుంబ సభ్యులతో కలిసి స్పీకర్ నివాసానికి వెళ్లారు. ఇష్టాగోష్టిగా మాట్లాడి పరస్పరం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా నరేశ్

మంచిర్యాలటౌన్: ఆటో యూనియన్ సర్వసభ్య సమావేశాన్ని జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా తూముల నరేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా వోలం రాజ్‌కుమార్, మంచిర్యాల పట్టణ కమిటీ అధ్యక్షుడిగా అంకతి సత్తయ్య, పట్టణ ఉపాధ్యక్షులుగా కొక్కుల చంద్రయ్య, మహేశ్ పటేల్, పెద్దరాజును ఎన్నుకున్నారు. మిగితా కమిటీ సభ్యులను త్వరలోనే ఎన్నుకోవాలని సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, చిట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ రైతువేదికలో భీమిని, బెల్లంపల్లికి చెందిన 35మంది అంగన్‌వాడీ టీచర్లకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి సీడీపీవో ఉమాదేవి పాల్గొని చిన్నారులకు ఆటపాటలతో నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, మమత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అక్రమంగా పట్టాలు చేసుకున్నవారిపై చర్య తీసుకోవాలి



మాట్లాడుతున్న దళిత రైతు కుటుంబాల సభ్యులు

భీమారం: మండలంలోని మద్దికల్ శివారులోని తమ భూములను కొందరు అక్రమంగా పట్టా చేసుకుని ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని ఆరెపల్లి గ్రామానికి చెందిన దళిత రైతులు ఆరోపించారు. ఈమేరకు భీమారం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడారు. మద్దికల్ శివారులోని సర్వే నంబర్లు 727 నుంచి 732 వరకు, 752, 758లోని 30 ఎకరాల భూమిని దాదాపు 60 ఏళ్ల నుంచి తాము సాగుచేసుకుంటున్నామని బాధిత రైతుల దుర్గం రాములుతోపాటు మరో 39 మంది రైతులు తెలిపారు. తాము సాగు చేసుకుంటున్న భూములకు ధరణి పాస్ పుస్తకాలు జారీకాని విషయం తెలుసుకున్న చెర్కు సరోత్తం రెడ్డి, సిరిపురం శ్రీనివాస్, గంధ్ర శరత్ చంద్రరావు, పుర్రెల్ల స్వామి, కట్ట నాగరాజు, రాంప్రసాద్ పాత పట్టాదారులైన సీతారాం, మగ్గిరాం కుటుంబాలతో చేతులు కలిపారని తెలిపారు. వారంతా కలిసి తమ భూములను అక్రమంగా పట్టా మార్పిడి చేసుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు భూములు ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని వెల్లడించారు. తాము సాగు చేసుకుంటున్న భూమిలోకి వచ్చి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారని తెలిపారు. రెండు రోజుల క్రితం అర్ధరాత్రి కట్ట నాగరాజు అనేవ్యక్తి తమ భూముల్లోకి వచ్చి తాము సాగుచేసిన పంటలను ధ్వంసం చేశాడని ఆరోపించారు. అక్రమంగా పట్టా చేసుకున్నవారిపై చర్య తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

ఒకరిపై అట్రాసిటీ కేసు..

మండల కేంద్రానికి చెందిన కట్ట నాగరాజు అనే వ్యక్తిపై మంగళవారం అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.రాములు తెలిపారు. మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన దుర్గం రాములు అనేదళితునికి సర్వే నంబర్ 729 లోని భూమితోపాటు పాటు పక్కనే ఉన్న 35 ఎకరాల్లో వేసిన పత్తిపంటను ఈనెల 7న ధ్వంసం చేశారని తెలిపారు. బాధితుడు రాములును కులం పేరుతో దూషించాడని పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

హైకోర్టు ఎదుట మహిళా న్యాయవాది నిరసన



బెల్లంపల్లి: తనపై దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం హైకోర్టు ఆవరణలో బెల్లంపల్లికి చెందిన మహిళా న్యాయవాది గాదవేణ మమత నిరసన తెలిపారు. ఎమ్మెల్యే పీఏ ప్రసాద్, మరి కొందరి ప్రోద్బలంతో తనపై దాడి జరిగినట్లు బాధితురాలు సహచర న్యాయవాదులకు తెలిపారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తనకు న్యాయం చేయాలని బాధితురాలైన మమత చంటి పాపతో నిరసన చేయడం చర్చనీయాంశమైంది.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

జైపూర్: ప్రభుత్వ అనుమతులు లేకుండా లీడర్ల పేర్లు చెప్పి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే సస్పెక్ట్ షీట్స్ ఓపెన్ చేస్తామని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. జైపూర్ అసిస్టెంట్ కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. కొంతకాలంగా ఇందారం, రామారావుపేట ట్రాక్టర్ యాజమానులు అక్రమంగా గోదావరి నది నుంచి ఇసుక తరలించి డంపు చేశారన్న సమాచారం మేరకు ఇందారం, రామారావుపేట శివారుల్లో రెవెన్యూ, మైనింగ్‌శాఖ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఇందారం సమీపంలో ఒకచోట 18 ట్రాక్టర్ల ఇసుక, మరోచోట 22 ట్రిప్పులు, రామారావుపేటలో తంగళ్లపల్లి వెంకటేశ్ భూమిలో 28 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను సీజ్ చేశారు. ఇసుక అక్రమ రవాణాను నియంత్రించడానికి గోదావరి నదిలోకి వెళ్లే రోడ్డు తొలగించామని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై సమాచారం ఇచ్చారని ఫిర్యాదుదారులను బెదిరించిన జైనొద్దీన్, గుండా శ్రీనివాస్, బెద్దల సాయికృష్ణ, పల్ల రాజ్‌కుమార్, జక్కుల రాహుల్, బూకాల స్వామి, వైద్య శేఖర్, పెద్దపల్లి సంపత్, నల్లి దీపుపై కేసు నమోదుచేసి బైండోవర్ చేసినట్లుగా వివరించారు. సమావేశంలో శ్రీరాంపూర్ సీఐ మోహన్, ఎస్సై శ్రీధర్ పాల్గొన్నారు.

మంచిర్యాల ఎమ్మెల్యేకు మంత్రి పదవిపైనే ధ్యాస

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుకు మంత్రి పదవిపైన ఉన్న ధ్యాస, ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఎందుకు లేదని జిల్లా బీజేపీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన మంచిర్యాల అసెంబ్లీ స్థాయి సమావేశంలో పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోమాసె శ్రీనివాస్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా, ఇప్పటి వరకు ఎన్నికల్లో ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయడంలో విఫలం అయ్యిందన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా పేరుతో రైతులను, నిరుద్యోగ భృతి పేరుతో నిరుద్యోగ యువతను, ప్రతి మహిళకు రూ.2,500 ఇస్తామని, పెన్షన్ పెంపుతో వృద్ధులు, దివ్యాంగులను ఇలా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే నియోజకవర్గంలో ఉన్న సమస్యలను గాలికి వదిలేసి, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలం చెందుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో గోనె శ్యాంసుందర్‌రావు, రజనీశ్ జూన్, నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, పురుషోత్తం జాజు, మున్నారాజా సిసోడియా, తోట మల్లికార్జున్, ముదాం మల్లేశ్, మోటపలుకుల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'అవుట్ సోర్సింగ్' కుటుంబాలకు చేయూత



చేయూత అందిస్తున్న కమాండెంట్, సిబ్బంది

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో అవుట్ సోర్సింగ్ ద్వారా విధులు నిర్వర్తిస్తూ మృతి చెందిన ఉద్యోగుల మూడు కుటుంబాలకు మంగళవారం బెటాలియన్ ఆర్థిక చేయూత అందించింది. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అయిన స్వీపర్ రాజు కుటుంబానికి రూ.35,100, కుక్ లింగయ్య కుటుంబానికి రూ.35,100, దోభీ బాపు కుటుంబానికి రూ.70వేల నగదును బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్‌భాషా ఆధ్వర్యంలో బెటాలియన్ సిబ్బంది కలిసి బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు నాగేశ్వర్‌రావు, రఘునాథ్‌చౌహాన్, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, బెటాలియన్ సిబ్బంది, అవుట్ సోర్సింగ్ కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



చెన్నూర్: మున్సిపాలిటీలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం 8వ వార్డులో సీజనల్ వ్యాధుల పై అధికారులు, మెప్మా సభ్యురాళ్లు, కౌన్సిలర్లు కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జోడు శంకర్, మెప్మా సభ్యురాళ్లు, ఆశ వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

న్యాయం కోసం పోరాడాలి



ఏజీపీని సన్మానిస్తున్న జడ్జి, న్యాయవాదులు

లక్సెట్టిపేట: న్యాయవాదులు న్యాయం కోసం పోరాడాలని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి సంపత్ అన్నారు. కోర్టులో నియామకమైన ఏజీపీ వేల్పుల సత్తయ్యను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో సన్మానించి మాట్లాడారు. ఏజీపీ వృత్తి చాలా ఉన్నతమైందని, పేదల పక్షాన న్యాయం కోసం కృషి చేయాలని తెలిపారు. అన్ని వృత్తుల్లో కెల్ల ఉత్తమమైనది న్యాయవాద వృత్తి అని, ప్రతి ఒక్కరూ వాటి విలువలను కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కశ్మీర్ నుంచి సైకిల్ యాత్ర

మందమర్రిరూరల్: దేశ పర్యావరణ పరిరక్షణలో భాగంగా సోలార్ విద్యుత్‌పై ప్రచారం చేయడంలో భాగంగా పంకజ్ మష్లో అనే యువకుడు కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్ర కొనసాగిస్తునాడు. జాతీయ రహదారిపై వెళ్లే క్రమంలో మంగళవారం సాయంత్రం మందమర్రి పాత బస్టాండ్ ఏరియాలో జాతీయ రహదారి పక్కన కాసేపు సేదదీరాడు. హర్యానా రాష్ట్రానికి చెందిన పంకజ్ చండీఘడ్‌లోని పంజాబ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ మూడో సంవత్సరం చదువుతున్నాడు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాలుష్యాన్ని నియంత్రణ చేయాలనే పిలుపుతో ప్రతి ఇంట్లో సోలార్ విద్యుత్ వినియోగించాలంటూ, బ్యాటరీతో నడిచే వాహనాలనే వాడాలని సూచిస్తూ యాత్రను కొనసాగిస్తున్నానని తెలిపాడు.

నర్సింగాపూర్ పాఠశాల తనిఖీ



మొక్క నాటుతున్న సత్యనారాయణ మూర్తి

భీమారం: మండలంలోని నర్సింగాపూర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలను మంచిర్యాల విద్యాశాఖ సెక్టోరియల్ ఆఫీసర్ సత్యనారాయణ మూర్తి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు తొమ్మిది, పదో తరగతి విద్యార్థులను వివిధ పాఠ్యాంశాల నుంచి ప్రశ్నలు అడిగారు. విద్యార్థులు సరైన సమాధానం ఇవ్వడంతో వారిని అభినందించారు. కష్టపడి చదివి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. ఇందులో పాఠశాల హెడ్మాస్టర్ సురేష్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలంపల్లిలో ఇంటింటికీ మొక్కలు పంపిణీ



పంపిణీ చేస్తున్న ఎంపీడీవో రాధారాథోడ్

భీమారం: మండలంలోని పోలంపల్లి గ్రామంలో మంగళవారం హరితహారం కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో రాధారాథోడ్ గ్రామస్తులకు ఇంటింటికి ఆరు మొక్కలు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీపతి బాపురావు, ఈజీఎస్ ఏపీవో జీనత్, టీఏ నక్కరాజన్న పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న జడ్జి సంపత్

లక్సెట్టిపేట: అండర్ ట్రయల్ ఖైదీలు క్రమశిక్షణతో ఉండాలని మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి సంపత్ సూచించారు. లక్సెట్టిపేట సబ్ జైల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడారు. అండర్ ట్రయల్ ఖైదీలు గొడవలు పెట్టుకోవద్దని సూచించారు. చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో జైలర్ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

కార్గో పార్శిల్ వేలం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల డిపో పరిధిలో ఆర్టీసీ కార్గోలో చాలా రోజులుగా తీసుకెళ్లని పార్శిల్‌కు వేలం నిర్వహిస్తున్నట్లు డీఎం రవీంద్రనాథ్ తెలిపారు. ఈ నెల 11, 12న మంచిర్యాల బస్‌స్టేషన్ కార్గో కేంద్రం వద్ద వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.